నిజం యశస్వీ.... అభిమాన నటుడి సినిమాకి టిక్కెట్ దొరకపోతే ఓ సమస్య..... కష్టపడకుండా కొడుకు పరీక్ష పాసవకపోతే ఒక సమస్య. పరీక్షల ముందు క్వశ్చన్ పేపర్లు లీక్ కాకపోతే సమస్య.

ఇలాంటి యీ సంఘంలో ఒకటీ అరా నిజాయితీపరులుంటే వాళ్ళను తరిమి చంపేయడం ఆనక వాళ్ళకి గొప్పదనాన్ని ఆపాదించి నాలుగు రోడ్ల కూడలిలో విగ్రహావిష్కరణ కోసమూ కాలాన్ని వెచ్చించే కళాత్మక హృదయులున్న యీ సొసైటీలో నీకేదో వాళ్ళు ఒరగబెడతారూ అనుకుంటే పప్పులో కాలేసినట్టే.

నవ్వుకోకు మిత్రమా! ఇంకా మూడు పదులు దాటని నిన్ను చూస్తుంటే ఎందుకో మనసు కదిలింది, నువ్వేదో అవుతావన్న బాధ నా చేత అలా మాట్లాడిస్తుంది" లేచాడు రామసూరి హరితని చూస్తూ.

"అమ్మా హరితా! ఇదంతా ఎందుకు చెప్పిందీ నువ్వయినా ఈపాటికి అర్థం చేసుకుని వుంటావు. తోడొచ్చావు నువ్వు..... తిరిగి తోడుగా వెనక్కు తీసుకు వెళ్ళాలి అంటే యశస్విని కాస్త జాగ్రత్తగా కాపాడుకో" వెళుతూ ఆగాడో క్షణం "మరేంలేదు- నానీ కథ ఇప్పుడు క్లయిమాక్స్‌కి చేరుకుంటుంది, సేవ్ హిమ్"

వెళ్ళిపోయాడు తూలుకుంటూ.

యశస్వినే రెప్ప వాల్చకుండా చూసింది, ఆ మాటలేవీ అతనిపై పని చేయలేదనడానికి నిదర్శనం యశస్వి చూపులే. చాలా దీర్ఘంగా అలోచిస్తున్నాడు.

ఉండుండి లేచాడు.

"ఎక్కడికి.....?"

"స్మశానానికి" టక్కున జవాబు చెప్పాడు.

*　　　*　　　*　　　*

దెయ్యంలా తల ఝాడించే చెట్టుకొమ్మల్లో గబ్బిలాల రెక్కల చప్పుడు వింటూ నెమ్మదిగా అడుగు పెట్టాడు యశస్వి.

అక్కడే ఓ సత్యాన్ని సమాధి చేయబోతే అతడు అడ్డం పడింది ఇప్పుడు మరో సత్యాన్ని వెలికి తీయాలనే అక్కడికి వచ్చాడు.

నెమ్మదిగా కళ్ళు చిట్లించి చూశాడు.

చితి చిటపటలు తప్ప అంతా నిశ్శబ్దం.

"తాతా!"

జవాబు లేదు.

మరోసారి పిలిచాడు.

సన్నని మూలుగు- అది వినిపించింది కాలుతున్న చితికి ఆవలి వేపు.....

కొన వూపిరితో కొట్టుకుంటున్న తవిటయ్య.....

గొంతు పెగల్లేదు. పొట్టంతా రక్తసిక్తమై వుంది "తాతా!"

"బాబు.... నానీ-" రొప్పుతున్నాడు.... "ఆ హరి మనుషులు....."

అంటే నానీని తవిటయ్య చూశాడు. "నానీని ఇక్కడ వాళ్ళు- ఏం చేశారు?" ఉద్విగ్నంగా అడిగాడు.

తలూపాడు అడ్డంగా "తెలీదు- వెంట.... తరి-" మాట్లాడలేకపోతున్నాడు.

తవిటయ్య మూలుగుతున్నాడు.

ఏ క్షణంలో అయినా ప్రాణాలు వదిలేట్లున్నాడు.

అలా గాయపడి చివరి దశలో వున్న తవిటయ్య ఒకవేళ మార్గమధ్యంలో ప్రాణాలు వదిలితే ప్రత్యర్థులకి ఎంత గొప్ప అవకాశమౌతుందో తెలిసిన యశస్వి ఆగలేదు.

వేగంగా నడుస్తున్నాడు

రోడ్డుని సమీపిస్తూ చూశాడు యశస్వి.

నలుగురు వ్యక్తులు అతనికి అడ్డంగా నిలబడి వున్నారు.

వాళ్ళు హరి అనుచరులే అని యశస్వి సులభంగానే గ్రహించాడు.

"ఆడ్ని దించుబే!" హుంకరించాడో వ్యక్తి .

ఇప్పుడు యశస్వి సమస్య

మృత్యువుతో పోరాడుతూ ఏ క్షణంలో అయినా ప్రాణం పోయేటట్టున్న తవిటయ్యని రక్షించటం.

* * * *

సరిగ్గా అదే సమయంలో....

తలుపు కిర్రుమన్న చప్పుడుతో ఉలికిపాటుగా కళ్ళు తెరిచాడు నానీ.

అలసటతో మాగన్నుగా నిద్రపోయిన నానికి ముందు అర్థం కాలేదు. తానెక్కడున్నది. తెలిసేసరికి ఒక ఆకారం ముందు నిలబడి వుంది భయానకంగా.

"నువ్వా...."

చీకటిలో అతడెవరన్నదీ గుర్తించలేకపోయినా ఎక్కడో విన్న ఆ కంఠం సునాయాసంగానే జ్ఞప్తికొచ్చింది నానీకి.

మొహంపై టార్చివేసి చూస్తున్న ఆ వ్యక్తి డి.యస్.పి. సుందర్.

"ఇక్కడున్నావా?"

తప్పించుకోవడానికి సాధ్యంకాని గుహలో ఆకలితో వున్న సింహపు నోటికి చిక్కిన లేడిపిల్లలా వణికిపోతున్నాడు.

"కుర్ర వెధవా!.... ఎంతమందికి పనిబెట్టావురా!"

మరో అడుగు ముందుకేశాడు డి.యస్.పి సుందర్.

నిజానికి అక్కడికి వచ్చింది అనసూయ చేతికి నాని ఆ ఫిల్మ్‌రోల్ ఇచ్చివుంటే రహస్యంగా అది శోధించాలనైతే అదృష్టవశాత్తూ నానియే చిక్కిపోయాడు.

చాలా ప్రశాంతంగా వుందిప్పుడు....

వెంటనే కాల్చి అప్పారావుకీ , తనకీ అతి ముఖ్యమైన ఓ సమస్యని అంతం చేద్దామనుకున్నాడు గాని ఒకవేళ ఫిల్మ్‌రోల్ మరెవరికయినా ఇచ్చాడేమోనన్న సందిగ్ధత కొద్దిగా వారించిందతన్ని.

ఎలాగూ అందుబాటులో వున్నాడు. అది కనుక్కుంటే ఓ పనయిపోతుంది కదా! అనుకుంటూ "నీ పేరు నానీ కదూ!" అడిగాడు.

"అవునూ.... నా పేరు నానీయే అంకుల్....." కట్టెలా బిగుసుకుపోతూ జవాబిచ్చాడు.

"మరేమో.... నేనేం తప్పు చేయలేదు.... తాతయ్య పంపితే వచ్చానన్నమాట... నిజమంకుల్..... నేనస్సలు అబద్దం చెప్పను. ఒట్టు"

"నువ్వు నిజంగా నిజమే చెప్తుతావట్రా!"

"ఓ" తలూపాడు "ఎందుకంటే అమ్మ, తాతయ్య బాగా నేర్పే రన్న మాట."

"అయితే అర్జెంటుగా ఓ నిజం చెప్పాలి" సుందర్ ఉత్సాహం ద్విగుణీకృతమైపోతుంటే "నీ దగ్గిర ఓ ఫిల్మ్ రోలుందిగా- అదేరా ఆ చచ్చిపోయిన రాందేవ్ అంకుల్ నీకిచ్చాడే...." వీలయినంత సాత్వికంగా అడిగాడు.

"అదెక్కడ-?"

నానీ చేతులు పాంటు జేబులపై బిగుసుకొన్నాయి.

ఇంతవరకు పూర్వమే ఆ ఫిల్మ్ రోల్ కోసం వెదికి ఉప్పు జాడీలో వున్న ఆ రోల్ తీసి జేబులో పెట్టుకున్నాడు.

"ఒరేయ్! నువ్వు చెప్పేది నిజమో అబద్ధమో నేను గుర్తు పట్టెయ్యగలను. ఎందుకంటే నేను పెద్ద పోలీసంకులన్న మాట. అంతగొప్ప అంకుల్ని కాబట్టే నీకు జుట్టు లేకపోయినా నువ్వు నానీవే అని పోల్చేశాను" ఈ సారి కాస్త కరుకుగా అన్నాడు.

"నిజమే అంకుల్! రోల్ నా దగ్గరే వుంది" ఇక్కడా అబద్ధం చెప్పలేదు. "చచ్చిపోతున్నప్పుడు పోలీసంకుల్ కివ్వమని చెప్పాడు ఆ చచ్చిపోయిన అంకుల్ కూడా."

"అలాగట్రా! మరిచ్చెయ్!"

"మరి నన్ను ఏమీ అనవు కదా!"

సుందర్ సహనం నశించిపోయింది. వేలెడంత లేని ఈ గడుగ్గాయి యిన్ని కండిషన్‌లు పెట్టడం అసలు నచ్చలేదు. దూకుడుగా రెండడుగులు ముందుకేసి నానీ రెక్క పట్టుకోబోతుంటే అడుగుల చప్పుడు వినిపించింది.

వెంటనే "గుడీవినింగ్" అన్న పలకరింపు.

ఊహించని ఈ అవాంతరానికి ముందు కంగారు, మరుక్షణం నానీ కంటబడతాడన్న

తొట్రుబాటుతో వేగంగా ద్వారం దాటి బయటకొచ్చాడు.

అక్కడ ద్వారానికి ఆనుకొని వున్న అరుగుపై రామసూరి కూర్చుని వున్నాడు. పెదవుల మధ్య బాటిలుంది. గటగటా త్రాగుతూ "అవునూ విష్ చేశానే- జవాబు యివ్వరేంటి?" అన్నాడు.

ఇలాంటి అతి ముఖ్యమయిన వేళ  రామసూరిలాంటి అతి ప్రమాదకరమైన వ్యక్తి రావడం తో తిక్క రేగిన సుందరం "అసలు నువ్విక్కడికెందుకు వచ్చావు" అంటూ అరిచాడు ఉద్వేగంగా.

"మీరెందుకొచ్చారో చెక్ చేద్దామని"

"నువ్వెవడివి?"

నవ్వాడు.

"ఎవడని అంత హైరానా పడిపోతున్నారు"

నానీ ఏ క్షణంలోనయినా బయటకొస్తే తన పథకం అంతా మట్టి గొట్టుకుపోతుంది.

"మిస్టర్ రామసూరీ! ఓ పోలీసాఫీసరుగా నేను ఎక్కడికన్నా వెళ్లగలను"

"నేనూ ఒక ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్టుగా ఏ మూలదాకయినా మిమ్మల్ని వెంటాడగలను."

"నువ్వెవడివి నన్ను వెంటాడటానికి? " సుందర్ పిడికిళ్ళు బిగుసుకున్నాయి.

"అలా అరవకండి సుందర్‌గారూ! ఏ పదవిలో వున్నవాడైనా నేరస్తుడైతే చాలు ఇలా ఫాలో అవుతుంటాను"

"వ్వాట్?"

"అరిచి ఎనర్జీ వేస్ట్ చేసుకోకండి. సామాన్యంగా అనుమానితుడ్ని మీ డిపార్టుమెంటువాళ్ళు వెంటాడుతుంటారు. కాని చిత్రంగా మా జర్నలిస్టుల లిస్టులో అనుమానితుడు కావడంతో మా కుర్రాళ్ళకి చెప్పాను మీమీద కన్నేసి వుండమని. ఓ పది నిముషాల క్రితమే కబురందింది. ఇలా సరాసరి వచ్చాను. మరేం లేదు. హరి తాలుకా  ఆధారాలు గట్రా చేరవేసే ప్రయత్న మేమన్నా చేస్తున్నారేమో అని"

"యూ" ఉక్రోషంగా మీదకు రాబోయాడు.

"తప్పు... ఆవేశపడకండి. అక్కడ గోడవార్న నిలబడ్డ మా వాళ్ళుగాని ఫోటోలు తీయగలరు. అలా

మీదకి వంగోవద్దు.... అబ్బే.... రికార్డర్ లేదు. అక్కడ ఫోటోలు తియ్యడానికి మా వాళ్ళుండగా రికార్డరెందుకండీ? ఎంతయిన చింత చచ్చినా పులుపు చావనివాడ్నిగా....

ఇలాంటిది ముందే ఊహించి ఇంటిదగ్గరే వదిలేశాను"

"నడు ఇక్కడ్నించి"

"వెళతాను.... ఆ హరిగాడ్ని ఎప్పుడు అరెస్టు చేస్తారు?...అప్పారావు రాజీనామా ఎప్పుడు

చేస్తాడు?.... అదికాస్త చెప్పండి."

"అదంతా నీ కెందుకు.....?"

"ఎంతమాట... నా కెందుకూ అనుకునే వాడ్నయితే ఈ ఫాలో అప్‌లూ, పత్రికలో ప్రచురించబడటాలూ ఎందుకు? మరేం లేదు. మరో ముఖ్యమైన వార్త.... అదే రేపుదయమే పబ్లిష్ కాబోయే మరో న్యూస్ మీకు చెప్పిపోదామనుకుంటున్నాను"

సాఫీగా అన్నాడు.